పర్యావరణాన్ని కాపాడుదాం..

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీఎం కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఏరియా జీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. జీఎం మాట్లాడుతూ... నేల పునరుద్ధరణ, ఏడారీకరణ, కరువును తట్టుకునే శక్తి అనే నినాదంతో ఈ ప్రపంచ పర్యావరణ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని చెప్పారు. సింగరేణి సంస్థ హరితహారం ద్వారా అనేక మొక్కలు నాటటం జరుగుతోందన్నారు. ప్రతీ ఉద్యోగి తమ వ్యకితగత కర్తవ్యంగా తప్పక మొక్కలను నాటాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటి రెడ్డి, ఏజీఎం ఎఫ్అండ్ఏ కే.హనుమలత, పర్సనల్ మేనేజర్ బి.శివకేశవరావు, ఎన్విరాన్‌మెంట్ మేనేజర్ టి.సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, డీజీఎం (ఐఈడీ) ఎన్.యోహాన్, క్వాలిటీ మేనేజర్ మదన్‌మోహన్, ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వి.శ్రీనివాస్‌రావు, ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, వివిధ యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: ప్రతీఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సింగరేణి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ కోసం పాటు పడుతున్న వారిని సన్మానించారు. కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కౌన్సిల్, ఐటీసీ- వావ్, మెప్మా ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్, వీరభద్రచారి, ఈ-శ్రీ ఫౌండేషన్, ఐటీసీ - వావ్ కోఆర్డినేటర్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. కొత్తగూడెం మేదర బస్తీలోని శ్రీరాగా స్కూల్‌లో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ కవిత, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.

కొత్తగూడెంరూరల్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ప్రతీఒక్కరు విధిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని సీడీపీఓ రేవతి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల పంచాయతీ గంగమ్మ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె మొక్కలు నాటారు. మాట్లాడుతూ... పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే భావనతో ప్రతీఒక్కరు మొక్కలు నాటాలన్నారు. మానవ మనుగడకి పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని, మనం అందరం భాగస్వామ్యం కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శిరీష అన్నారు. బుధవారం జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని సఫాయి బస్తీలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సుకృత, పీఓఎన్‌సీడీ మధువరణ్, ఇమ్మాన్యుయేల్, హరికిషన్ పాల్గొన్నారు.

చుంచుపల్లి: ప్రతీఒక్కరు విధిగా మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ వాసిరెడ్డి అశోక్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామపంచాయతీ మూలుగ్గూడెం హ్యాబిటేషన్‌లో చెరువు, కుంటల కట్టలపై మొక్కలు నాటారు. ఈ నెల 12 వరకు వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టి పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలన్నారు. అనంతరం పర్యావరణం పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పెనగడప గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిని పి.వసంత, ఏపీఓ రఘుపతి, పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవ, రఘు, హనుమంతు, డీఆర్‌డీఏ సిబ్బంది రాజరత్నం, వీరన్న, రాజు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రతీ ఇంటిలో ఇంకుడుగుంతలను నిర్మాణం చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యవరణ దినోత్సవం సందర్భంగా పునుకుల గ్రామంలో అమృత్ సరోవర్ ట్యాంక్‌పై బుధవారం ఎంపీడీఓ మొక్కలను నాటారు. మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పండ్ల మొక్కలను ఉచితంగా ఇవ్వడంతోపాటు మొక్కలను నాటి వాటికి మెయింటెన్స్ ఖర్చును కూడా ప్రభుత్వం భరిస్తుందన్నారు. జామ, నిమ్మ, మునగ, అయిల్ ఫామ్ మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీఓ నారాయణ, ఏపీఓ పొరండ్ల రంగా, కార్యదర్శి బాబూరావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలాజ్యోతి అన్నారు. బుధవారం మాచినేనిపేట అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన సెక్టార్ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సఖీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, రాజమణి, సునీత, శారద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్ఐ జీవన్ రాజు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇడుపుల రాజు, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, తంబర్ల నరసింహారావు, లక్ష్మణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: చెట్లు పెంచితే నీడ, పండ్లు ఇచ్చి పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. బుధవారం ఇల్లెందు కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం సేవ్ ట్రీస్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రవి, కె.ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సింగరేణి ఏరియాలో...

సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బుధవారం జీఎం కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలలో ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. జీఎం మాట్లాడుతూ.. భూమి ఏడారిగా మారిపోతోందని చెట్లు పెంచాలని, భూగర్భంలో జలం అడుగంటి పోకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సింగరేణి మైనింగ్ కార్యకలాపాల వల్ల గాలీ, నీరు, భూ వనరులపై ప్రభావాలను పర్యవేక్షించి అధునాతన, సాంకేతికతల ద్వారా వివిధ కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 5 కోట్ల మొక్కలతో 14,680 హెక్టార్ల ప్లాంటేషన్ చేపట్టామని తెలిపారు. గని ప్రభావిత గ్రామాలకు 2.25 కోట్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఐఈడీ ఇంజనీర్ గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, డీజీఎం సర్వే బాలాజీనాయుడు ఉన్నారు.

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కేఓసీ మేనేజర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత అన్ని విభాగాల అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ... జూన్ 5 మన భూమిని రక్షించడానికి, సంరక్షించవలసిన తక్షణ అవసరాన్ని గుర్తు చేస్తుందన్నారు. ఈ సంవత్సరం థీమ్ నేల పునరుద్ధరణ ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి నేడు మనం ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లు విస్తారమైనవి, బహుముఖమైనవి, వాతావరణ మార్పు, అటవీ నిర్మూలన, కాలుష్యం, జీవవైవిధ్య నష్టం వంటివి మన భూమాత యొక్క ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయని, పర్యావరణాన్ని పరిరక్షించే విధానాలను రూపొందించడంలో, అమలు చేయడంలో ప్రభుత్వాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ పర్యావరణ అధికారి ఉండం బ్రహ్మం, అధికారులు రవికుమార్, కృష్ణ, యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



టేకులపల్లి: కేఓసీలో పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఇల్లెందు: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కొత్తగూడెంరూరల్: మొక్క నాటుతున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారి శిరీష



ఇల్లెందు: పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం జాన్ ఆనంద్, అధికారులు



చుంచుపల్లి: మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎంపీడీఓ అశోక్



పాల్వంచరూరల్: పునుకుల గ్రామంలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి



ఇల్లెందు: మొక్క నాటుతున్న న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి



జూలూరుపాడు: మాచినేనిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న సీడీపీఓ నిర్మలాజ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు

క్లుప్తంగా

కొత్త చట్టాలపై పోలీసులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న పోలీసులు

ఇల్లెందు: నేర న్యాయ వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు మూడు కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన శిక్షణ మొదటి బ్యాచ్ పూర్తి చేసినట్లు డీఎస్పీ ఎన్.చంద్రభాను తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 1వ తేదీ నుంచి ఇల్లెందులో పోలీసులకు మొదటి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినియం -2023 ఈ మూడు చట్టాలు జులై 1 నుంచి అమలులోకి రానున్నాయని తెలిపారు. ఈ మూడు చట్టాలు భారత శిక్షాస్మృతి (ఐపీసీ-1860) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, సీఆర్‌పీసీ-1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ -1872 రీప్లేస్ చేయనున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసిన పోలీసులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ



ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

జూలూరుపాడు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూలూరుపాడు అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం అటవీ అధికారులు, సిబ్బంది కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్ గుండెపుడి బీట్ సురారం వెళ్లే రహదారికి ఇరువైపుల ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన అటవీ అధికారులు, సిబ్బంది సురారం డంపింగ్ యార్డుకు తరలించారు. అంతకముందు జూలూరుపాడు అటవీ నర్సరీ, గుండెపుడి ప్లాంటేషన్‌లో అటవీ అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, డీఆర్ఓ లక్ష్మీ నర్సు, ఎఫ్ఎస్ఓలు సలీం, హనుమంతు, ఎఫ్‌బీఓలు వెంకటేశ్వర్లు, రవి, జె.కిషన్, రేఖ, శ్రీలత, విజయలక్ష్మి, డి.కిషన్, రహీం తదితరులు పాల్గొన్నారు.

పీఓడబ్ల్యూ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కళావతి

టేకులపల్లి: సామ్రాజ్యవాద, భూస్వామ్య విష సంస్కృతికి, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా అన్నివర్గాల మహిళలకు పురుషులతో సమానంగా సమానత్వ హక్కుల సాధన కోసం పోరాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు జూన్ 10న ఇల్లెందులో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు నోముల కళావతి తెలియజేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మహిళలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. దేశంలో మోదీ అధికారంలోకి వచ్చాక మహిళల పరిస్థితి దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యలకు పాల్పడుతున్న హంతకులకు ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భయ్య శారద, పెద్దగోని ఆదిలక్ష్మి, కల్తి రాములమ్మ, మోకాళ్ల సుగుణ, జాడి మంజుల, రేళ్ల నాగలక్ష్మి, లాలమ్మ, సంధ్య పాల్గొన్నారు.

'నీట్'లో మెరిసిన విద్యార్థులు



విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లెందు: శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు నీట్‌లో ర్యాంకులు సాధించారు. బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ పత్తి శ్రీనివాస్ విద్యార్థులను ఘనంగా అభినందించారు. నీట్‌లో ఆలిండియా స్థాయిలో ర్యాంకు సాధించిన బి.సాయిచంద్(5565), టి.భవ్యశ్రీ 24614 ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులను అభినందించారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించండి



మన ఊరు - మన అంగన్‌వాడీ కార్యక్రమంలో సీడీపీఓ అరుణకుమారి, అంగన్‌వాడీలు

కొత్తగూడెంటౌన్: ప్రతీ తల్లి తన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, ఆటపాటలతో పాటు చదువుకు నేర్పిస్తామని కొత్తగూడెం సీడీపీఓ అరుణకుమారి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కొత్తగూడెం ఆధ్వర్యంలో సన్యాసి బస్తీలో బుధవారం మన ఊరు - మన అంగన్‌వాడీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మాట్లాడుతూ... అంగన్‌వాడీ విద్య ఆట పాటల విద్య అన్నారు. అందుకే ప్రతీ తల్లి తమ పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలని, ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు బడి ఉంటుందని ఉచిత భోజనంతో పాటు స్నాక్స్, గుడ్లు అందజేస్తామన్నారు. సూపర్‌వైజర్ సీత, అంగవాడీ టీచర్లు గుణలక్ష్మి, విజయలక్ష్మి, ఆయాలు కాజా భేగం, జయమ్మ, సంతోషి, ఎన్ఎన్ఎం దివ్య, ఆశా వర్కర్ భాగ్య శిరీషా పాల్గొన్నారు.

జేకే ఓసీ అధికారులకు జీఎం అభినందన



అభినందిస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ అధికారులను ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఘనంగా అభినందించారు. బుధవారం ఇల్లెందులోని జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ పర్యావరణ అనుకూల గనిగా జేకే ఓసీని గుర్తించినందున అక్కడి అధికారులను అభినందించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి సీఎండీ, చైర్మన్ బలరాం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సర్వే బాలాజీనాయుడు, మేనేజర్ పూర్ణచందర్, పర్యావరణ అధికారి ధనుంజయ్‌రెడ్డి, వీర నాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

కబ్జాపై చర్యలు తీసుకోండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో 15వ వార్డులో ఓ ఇంటి యజమాని రోడ్డును ఆక్రమించి గేటును ఏర్పాటు చేశారు. దీనిపై స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. గేటు ఏర్పాటు చేయడం వలన రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

పాల్వంచరూరల్: ఉదయం నుంచి సాయంత్రం వరకు బుధవారం ఎండ తీవ్రంగా ఉంది. సాయంతకన 6 గంటల నుంచి వాతవరణం మేఘావృతమై గాలిదుమారం, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మండలంలో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో వీధులు, రోడ్లపై వరద ప్రవహించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ న్యూడెమోక్రసీ అనుబంధ అఖిల భారత రైతుకూలీ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్, వ్యవసాయ శాఖ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఆయా కార్యాలయాలలో అధికారులకు అందజేశారు. బొగ్గారపు సంగయ్య అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతాంగానికి సరిపడా విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ప్రభుత్వమే సరఫరా చేసి నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, రైతు బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్తి సీతారాములు, పొడుగు నర్సింహారావు, కొక్కు సారంగపాణి, పూనెం కోటయ్య, చిన్నస్వామి, బానోత్ సంతు, మూడు మాలు, వెంకన్న, లక్ష్మీనారాయణ, మోహన్‌రావు, గూళ్ల సదయ్య, మోతీలాల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

9న ఏఐటీఎఫ్ రాష్ట్ర సదస్సు

టేకులపల్లి: ఆదివాసీ ప్రాంతంలో సహజ వనరులను, శ్రమశక్తిని పాలకులు దోచుకుంటున్నారని, కార్పొరేట్ సంస్థలకు అడవిని దోచిపెడుతూ ఆదివాసీలను దగా చేస్తున్నారని ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) నాయకులు ఎట్టి నరసింహారావు అన్నారు. జూన్ 9న కొత్తగూడెంలో జరగనున్న ఆల్ ఇండియా ఆదివాసీ ట్రైబల్ ఫోరం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం టేకులపల్లి మండలం బోడు కొత్తగూడెం గ్రామంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల నుంచి ఆదివాసీలు భారతదేశంలో అణిచివేతకు గురై ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఆదివాసీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని, సమస్యలను పరిష్కారానికి పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రవి, పాపారావు, సత్యం, లక్ష్మణరావు, వసంతరావు, నరసింహారావు, సాలమ్మ పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఇల్లెందురూరల్: 9న కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఫోరం జాతీయ కమిటీ సభ్యుడు సూర్నపాక నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు కొమ్ముగూడెం పంచాయతీ నాయకుల గూడెంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యాల కారణంగా అస్తిత్వాన్ని కోల్పోతున్న ఆదివాసీలకు ఫోరం అండగా ఉంటుందన్నారు. ఎల్లబోయిన పొట్టయ్య, రామచంద్రు, వెంకటేశ్వర్లు, భద్రయ్య, లక్ష్మయ్య, రామయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారులు అధ్వానం

- మార్కెట్‌లో గుంతలమయమైన రోడ్లు
- వాహనదారుల ఇబ్బందులు
- నడవడానికి వీలులేక పాదచారుల అవస్థ



పంజాబ్‌గడ్డ బస్తీ మార్గంలో గుంతలమయమైన రహదారి

కొత్తగూడెంటౌన్: రామవరం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం మార్కెట్ నుంచి పలు వీధులకు వెళ్లే అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై గుంతలు పడి, కంకర తేలడంతో పగలు, రాత్రుళ్లు వాహనదారులు, రాకపోకలను సాగించాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. రామవరం మార్కెట్‌కు నేతాజీ బస్తీ, నెహ్రూ బస్తీ, లక్ష్మీటాకీస్ ఏరియా నుంచి, పంజాబ్ గడ్డ బస్తీ, 14 నంబర్, 7 నంబర్ బజార్, పెద్ద చమాన్ మార్గాల గుండా చేరుకుంటారు. అదేవిధంగా చిట్టిరామవరం, వనందాస్‌గడ్డ బస్తీ, సీఆర్‌పీ క్యాంప్, కల్లుగడ్డ, వీఎంఏ ఆఫీస్ లైన్, క్లబ్ ఏరియా, ప్రశాంతినగర్ కాలనీలతో పాటు పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆయా మార్గాల గుండా రామవరంలోని మార్కెట్ ఏరియాకు చేరుకుంటారు. ఆయా ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చే రోడ్లన్నీ గుంతల మయంగా మారి కంకర తేలి ఉంటుంది. దీంతో ఆ రోడ్డు మార్గాల్లో ద్విచక్ర, ఆటో, కారు, లారీ, పాఠశాల, కళాశాల బస్సులు వంటి వాహనాలు ప్రయాణించేటప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు పగలు ప్రయాణించాలంటేనే భయంభయంగా వెళుతుంటే ఇక రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని ప్రాణభయంతో వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై గుంతలు ఉండటంతో వాహనాలు స్కిడ్ అయి పడిపోయి గాయపడిన సంఘటనలు చాలా ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులకు రోడ్లు బాగోలేవని ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రామవరం మార్కెట్‌తో పాటు సమీపంలోని పలు వీధుల్లో ఉన్న రహదారులన్నీ గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



రామవరం లక్ష్మీటాకీస్ ఏరియాకు వెళ్లే రహదారిలో ఇలా...

ప్రమాదాలను నివారించాలి...



రామవరం నెహ్రూ బస్తీలోని మా వీధి ముందున్న రోడ్డు గుంతలు పడి తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మొత్తం అడుగుకో గుంత పడింది. గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలి. రోడ్డుకు మరమ్మతు చేయించి, ప్రమాదాలను నివారించాలి.

– కమలాదేవి, నెహ్రూ బస్తీ

మరమ్మతు చేయించాలి



రామవరం మార్కెట్‌కు చిట్టి రామవరంకు వస్తున్న ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటాం. అలా వెళ్లి వస్తున్న సందర్భంగా రోడ్లు అన్ని గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారుల వాహనాలు స్కిడ్ అయి పడి పోయి ప్రమాధాల భారీన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలి.

– భూక్యా శ్రీనివాస్, చిట్టి రామవరం

గుంతలు పూడ్చి వేయిస్తాం..



రామవరం మార్కెట్ ఏరియా రాకపోకలు సాగిస్తున్న ఇతర ప్రాంతాలకు వెళ్లే అంతర్గత రహదారులపై గుంతలను పూడ్చుతాం. ప్రజలకు, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేయిస్తాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండి అరికడతాం.

– శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం